క్లుప్తంగా

ఆశా కార్యకర్తను నియమించండి

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక ఎస్సీ కాలనీలో ఆశా కార్యకర్తను నియమించాలని సర్పంచ్ గంగాధరం, గ్రామస్తులు ఏర్పేడు పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్‌బాబుకు గురువారం విన్నవించారు. గతంలో విధులు నిర్వహిస్తున్న ఆశ కార్యకర్త పక్షవాతంతో మూడేళ్లుగా ఇంటికే పరిమితమైనట్లు చెప్పారు. అప్పటి నుంచి కాలనీలో ఆశకార్యకర్తను నియమించకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

లే అవుట్‌లలో రాళ్ల తొలగింపు


లేఅవుట్‌లో రాళ్లు తొలగిస్తున్న అధికారులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలోని పొయ్య పంచాయితీ పరిధిలో అనధికారంగా ఉన్న లే అవుట్ల రాళ్లను మండలాధికారుల ఆధ్వర్యంలో తొలగించారు. లేఅవుట్లను యజమానులు నిబంధనలకు అనుగుణంగా క్రమబద్ధీకరించుకోవాలని కోరుతూ ఇటీవల లే అవుట్ యజమానులకు నోటీసులు జారీ చేశారు. వారు సకాలంలో స్పందించక పోవడంతో గురువారం ఈవోపీఆర్డీ తరుణాక్షి రెడ్డి ఆధ్వర్యంలో లేఅవుట్‌లోని రాళ్లను తొలగించారు. లేఅవుట్‌లలో ప్లాట్లు కొనరాదని, అమ్మరాదని సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి చెంచయ్య, అధికారులు పాల్గొన్నారు.

30న ఉచిత వైద్యశిబిరం

శ్రీకాళహస్తి: పట్టణంలోని బాబు అగ్రహారం ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆధ్యాత్మిక అవధూత మాస పత్రిక యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ వైద్యశిబిరానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం తదితర వైద్యనిపుణులు విచ్చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తలారివెట్టులో భూముల రీసర్వే


భూమి వివరాలను పరిశీలిస్తున్న వీఆర్‌ఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తలారివెట్టు గ్రామరెవెన్యూలో చేపట్టిన భూముల రీసర్వేకు సహకరించాలని వీఆర్‌ఓ రమణారెడ్డి తెలిపారు. ఆయన గురువారం తలారివెట్టు గ్రామంలోని భూముల రీసర్వేను చేపట్టారు. గ్రామంలోని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వేను రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. భూముల రీసర్వేలో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. సాగులో ఉన్నవారి పేరుపై భూమికి పాసుపుస్తకాలు వస్తాయని, ఆన్‌లైన్‌లో వారి పేరు నమోదు అవుతుందన్నారు. భూమి కొలతలు పక్కాగా ఉంటాయని, హద్దు రాళ్లను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రసాద్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడిలో డిజిటల్ పాఠాలు ప్రారంభం

చంద్రగిరి (తిరుపతి రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ పాఠాల బోధనను ప్రవేశపెట్టారు. చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం డిజిటల్ పాఠాలను హెచ్‌ఎం విజయ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ డిజిటల్ స్క్రీన్ ద్వారా పాఠాలు నేర్చుకోవడం చాలా సులభమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణమూర్తి, రమేష్, రామమూర్తి, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

30న 'తులసీ మహాత్యం'

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో 30వ తేదీన తులసి మహాత్యం ఉత్సవం నిర్వహించనున్నారు. స్వామివారికి తులసి దళం అత్యంత ప్రీతికరమైంది. శ్రావణ శుద్ధ ద్వాదశినాడు తులసి ఆవిర్భావం జరిగిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఎన్‌సీసీ హార్స్‌లైన్ తనిఖీ

తిరుపతి సిటీ: తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ ప్రధాన కార్యాలయం, వెటర్నరీ కళాశాల ప్రాంగణంలో వున్న హార్స్‌లైన్ యూనిట్‌ను గురువారంపీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, తెలంగాణా ఎన్‌సీసీ డైరెక్టర్ వీఎం రెడ్డి తనిఖీ చేశారు. తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్స్‌కు సంబంధించిన ట్రైనింగ్‌పై ఆరా తీశారు. ప్రతిభావంతులైన యువతను సరైన క్రమశిక్షణతో భావిభారత పౌరులుగా, ఆదర్శనీయులు తీర్చిదిద్దాల్సి అవసరం ఉందన్నారు. అనంతరం ఆయన హార్స్‌లైన్ యూనిట్ పరిశీలించి గుర్రాల ఆరోగ్యంపై ఆరా తీశారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

• ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం


నాగలాపురం: సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఆదిమూలం, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్,


శ్రీకాళహస్తి: సీఎం జగన్, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

పిచ్చాటూరు: ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం ఉదయం నాగలాపురం సచివాలయం -2 పరిధిలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ సచివాలయ పరిధిలో మొత్తం 219 సర్టిఫికెట్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సర్టిఫికెట్లు పంపిణీ చేయడం ప్రజలకు వరమన్నారు. సీఎం జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలతో పాటు ఎక్కువ మంచి చేస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తు పెట్టుకుని వచ్చే ఎన్నికల్లో జగనన్న ఆశీర్వదించాలన్నారు. నిత్యం ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్ల మనోభావాలు దెబ్బతినే విధంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబు మాట్లాడడం దారుణమన్నారు. వీరికి 2024 ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజల నుంచి విశేష స్పందన..

జగనన్న సురక్ష ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ ఈ జగనన్న సురక్ష పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. గ్రామీణ ప్రజలు ఉపాధి పనుల్లో పాల్గొనాలని కోరారు. ప్రస్తుతం మొక్కలు పెంపకం, పూల తోటల సాగును ఉపాధి పథకం ద్వారా చేసుకోవచ్చని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మజ, తహసీల్దారు ప్రసన్నకుమార్, సర్పంచ్ సుధ, సింగిల్‌విండో చైర్మన్ అపరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, మొదలియార్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కల్పన, సింగిల్‌విండో డైరెక్టర్ షాబుద్దీన్, కులశేఖర్ రెడ్డి, అలగేశన్, వైఎస్సార్ టీయూసీ నియోజకవర్గ చైర్మన్ ఎస్‌ఎం సురేష్, నాయకులు మహేష్ రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డి, శ్యామ్, డానియేల్, దేశప్పన్ పాల్గొన్నారు.

పిచ్చాటూరు మండలంలో..

పిచ్చాటూరు మండలం రామగిరి సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా మొత్తం 936 సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు మధుసూదన్ రావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ పాలపద్మనాభం, సర్పంచ్ సతీష్, రాజగోపాల్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శోభన్, రామగిరి ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు, సచివాలయకన్వీనర్ తొప్పయ్య, నాయకులు చలపతిరాజు, చెంగల్రాయ రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. ప్రజలకు రక్ష

సత్యవేడు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన అనేక సేవలు ఉచితంగా అందజేస్తున్నామని మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం సత్యవేడు-1లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. సచివాలయ పరిధిలో 630 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో రూ.10.79 కోట్లు వివిధ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. 367 మందికి వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ భరోసా ద్వారా 116 మందికి రూ.62.64 లక్షలు, 77 మందికి ఇళ్లు, జగనన్న అమ్మఒడి 207 మందికి, జగనన్న వసతి దీవెన 121 మందికి, జగనన్న విద్యాదీవెన 188 మందికి, వైఎస్సార్ చేయూత 194, వైఎస్సార్ సున్నావడ్డీ 599 మందికి, జగనన్న విద్యాకానుక 3500 మందికి అందజేశామన్నారు. కొత్తగా పెన్షన్లు 41 మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ బి.సోమశేఖర్, 1, 2 సచివాలయ కన్వీనర్లు మునికృష్ణయ్య, రవి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీటీసీ ఇంద్రాణి, పునిత్‌కుమార్ ఎంఈఓ రవి, ఈఓపీఆర్డీ మునిరవికుమార్, వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు శ్యాంప్రసాద్ రెడ్డి, పార్టీ నాయకులు కృష్ణయ్య, దయాళ్, మహేష్, మురళి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

సామాన్య ప్రజలకు చేరువగా ప్రభుత్వ సేవలు

నారాయణవనం: సామాన్య ప్రజలకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయని ఎంపీపీ దివాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎరుకంబట్టు గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత ధ్రువపత్రాలు, సంక్షేమ పథకాల లబ్ధి కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి నుంచి సీఎం జగనన్న సామాన్యులకు విముక్తి కల్పించారని అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష సర్వేలో నమోదు చేసుకున్న పలువురికి వివిధ ధ్రువపత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు సుదర్శనరెడ్డి, ఎంపీడీఓ గుణశేఖర్, తహసీల్దార్ ప్రమీల, మండల కన్వీనర్ సారకాయలు, వైస్ ఎంపీపీ హేమమ్మ, సర్పంచ్‌లు సుబ్బలక్ష్మి, నాగూరు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సచివాలయాల ఇన్‌చార్జి తిరకాల మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని 34, 35వ వార్డు పరిధిలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందేశారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి పథకాలు అందలేని వారు ఈ ధృవపత్రాల ద్వారా పొందవచ్చన్నారు. అందులో భాగంగానే 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు. అనంతరం లబ్ధిదారులు ఉత్సాహంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలకంఘ ఇన్‌చార్జి కమిషనర్ ఉమామహేశ్వరరావు, నాయకులు వయ్యాల కృష్ణారెడ్డి, ఆర్కాడు శంకర్, నాగేందర్ రెడ్డి, గిరప్రసాద్, సాదన మున్నా రాయల పార్థసారథిగౌడ్, గోపాల్‌యాదవ్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




పిచ్చాటూరు: రామగిరిలో సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులతో అధికారులు, సత్యవేడు: సర్టిఫికెట్లు చూపుతున్న లబ్ధిదారులు, నారాయణవనం: ధ్రువీకరణపత్రాలను అందజేస్తున్న ఎంపీపీ దివాకర్‌రెడ్డి

విద్యార్థులకు వైద్యపరీక్షలు


విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

శ్రీకాళహస్తి: మండలంలోని ఊరందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. వారికి మూగ, చెవుడు, గుడ్డి, బుద్ధిమాంద్యం, రక్తపరీక్షలు, జ్వరపరీక్షలు నిర్వహించారు. బాలికలకు కొంతమేర రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు. వారికి మాత్రలు పంపిణీ చేసి తగిన సూచనలు ఇచ్చారు. రక్తవృద్ధికి ఎలాంటి ఆహారాన్ని తీసుకోవాలని అనే విషయాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రవీణ, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ వనజాక్షి, ఆశా వర్కర్లు ఉదయమ్మ తులసమ్మ, రోజా, ఉపాధ్యాయులు సురేష్, శాంతి, రజియా, మురళి, రమేష్‌బాబు, మల్లికార్జున, సుమతి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ధర్మరాజుల స్వామి ఊరేగింపు


పుష్పపల్లకిలో ధర్మరాజు స్వామి

పిచ్చాటూరు: మండలకేంద్రంలో జరుగుతున్న ధర్మరాజుల తిరునాళ్లలో భాగంగా గురువారం ధర్మరాజుల ఊరేగింపు పట్టణ ప్రజలను కనువిందు చేసింది. ఉదయం నుంచి ఆలయంలో మహాభారత కథలో శ్రీకృష్ణుడు యుద్ధానికి ముందు కౌరవుల వద్దకు సంధికి వెళ్లే ఘట్టాన్ని ఆలపించారు. ఆలయంలోని ధర్మరాజుల ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని పల్లకిలో అమర్చి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించి మంగళ వాయిద్యాలు, గెరిగ నృత్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పట్టణంలో ఊరేగించారు. భక్తులు పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. కంకణం ధరించిన దీక్షాపరులు స్వామివారి సేవలో తరించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో మహాభారతం వీధి నాటకం ప్రజలను ఆకట్టుకుంది. సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 7 గంటలకు అర్జున తపస్సు, 11 గంటలకు మహిళల పాల ముంతల ఊరేగింపు, మధ్యాహ్నం ధర్మరాజుకు పాలాభిషేకం ఉంటుందన్నారు.

ఆడికృత్తిక తెప్పోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ


రామగిరిలో ఆడికృత్తిక పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: మండలంలోని రామగిరి శ్రీ సుబ్రమణ్య స్వామి ఆలయ ఆడికృత్తిక తెప్పోత్సవ పోస్టర్లను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆవిష్కరించారు. గురువారం ఆయన రామగిరిలో పర్యటించారు. ఆగస్టు 8, 9, 10 తేదీల్లో జరిగే సుబ్రమణ్య స్వామి తెప్పోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆయన కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని ఆలయ చైర్మన్ కేఎల్ వెంకటేశ్వర్లకు సూచించారు. అనంతరం పాలకమండలి సభ్యులు ఎమ్మెల్యే ఆదిమూలంకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు మధుసూదన్ రావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు శోభన్, పల్లికొండేశ్వరాలయ బోర్డు సభ్యులు ఆనంద్, నాయకులు చలపతిరాజు, మోహన్, సుబ్రమణ్యం , మురళీనాయుడు, చెంగల్రాయ రెడ్డి, పరంధామన్, సుబ్రమణ్యం, రమేష్ పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష శిబిరం

నారాయణవనం: మండలంలోని కీళగరం సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే శిబిరంలో మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు తదితరులు పాల్గొనాలని ఆయన కోరారు.

కూలీల శాతాన్ని పెంచండి


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిడ్డయ్య

ఏర్పేడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో కూలీల శాతాన్ని పెంచాలని ఎంపీడీఓ గిడ్డయ్య అన్నారు. మండలంలోని అంజిమేడులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం ఆయన తనిఖీ చేసి, కూలీల హాజరు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు రోజుకు రూ.272 వేతనాలు వచ్చే విధంగా కొలతలు చేయించాలని సూచించారు. ప్రతి పంచాయతీలో వంద మంది కూలీలు పనులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల పొలాల్లో పూలు, మామిడి, మునగ తోటల పెంపకం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకురాలు గీతాంజలి, కూలీలు పాల్గొన్నారు.

సమగ్ర ఓటరు సర్వేకు సహకరించండి


మాట్లాడుతున్న తహసీల్దార్ షేక్ జరీనా

సత్యవేడు: మండలంలో చేపడుతున్న సమగ్ర ఓటరు సర్వేకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని తహసీల్దారు షేక్ జరీనా కోరారు. గురువారం సాయంత్రం రెవెన్యూ కార్యాలయంలో వివిధ పార్టీల ప్రతినిధులతో ఓటర్లు జాబితాపై సమావేశం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ మండల పరిధిలో 50 మంది బీఎల్‌ఓలను నియమించామన్నారు. ప్రతిరోజు బీఎల్‌ఓలు ప్రత్యేక ఓటర్ల సవరణ-2024 మేరకు వారి పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి సమగ్రంగా సర్వే చేపడతారన్నారు. ఆగస్టు 21 వరకు ఇంటింటి సర్వే జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు ఫారం-6కు 408, ఫారం-7కు 198, పేర్ల సవరణకు 1257 వినతులు అందాయన్నారు. 1400కి పైగా ఓట్లు ఉన్న మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు పోలింగ్ బూత్‌ల వారీగా నియమించుకున్న బీఎల్‌ఏల పేర్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కే.సుశీల్‌కుమార్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్యాంప్రసాద్ రెడ్డి, రమణయ్య, బీజేపీ నాయకులు ప్రతాప్, మోహన్ బాబు, సీపీఎం రమేష్, తెలుగుదేశం నాయకులు గోవింద్, దిలీప్, ఎన్నికల డీటీ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరి పంట పరిశీలన


మొలకెత్తిన వరిధాన్యాన్ని చూపుతున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వరి పంట దెబ్బతింది. గురువారం మండలంలోని భవానీ శంకరపురం గ్రామంలో దెబ్బతిన్న వరిపంటను వ్యవసాయాధికారి భారతి పరిశీలించారు. సుమారు 150 ఎకరాల్లో వరిపంట నీట మునిగి పూర్తిగా దెబ్బతిందని, కోత దశలో ఉన్న వరిపంట వర్షాలకు నేలకొరిగిందన్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట చేతికి వచ్చే సమయంలో ఇలా వర్షానికి తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మూడు రోజులుగా కురిసిన వర్షాలకు వరిపంట దెబ్బతినిందన్నారు. అలాగే ధాన్యం తడిసిపోవడంతో మొలకలు వస్తున్నాయని తెలిపారు. కేఎన్‌ఎం-1638 రకం వరి పంటలో ధాన్యం పూర్తిగా తడిచి మొలకెత్తిందన్నారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా గట్లు తెంపేయాలన్నారు. పంట నష్టంపై జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపుతానని తెలిపారు. మొలకెత్తిన వరిధాన్యాన్ని రైతులు వ్యవసాయ అధికారికి చూపించారు.

చూలు ఆవుపై విషప్రయోగం

కేవీబీ పురం: ఇద్దరు వ్యక్తుల మధ్య తలెత్తిన వివాదంతో చూలు ఆవుపై విషప్రయోగం చేసిన ఘటన కేవీబీపురం మండలంలో గురువారం వెలుగుచూసింది. మండలంలోని దిగువపుత్తూరు గ్రామానికి చెందిన రాధ(38) పాడి ఆవుల ద్వారా జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన గిరిబాబు, చిన్నబ్బతో ఆమెకు గతంలో స్వల్ప వివాదాలు ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో సోమవారం నుంచి రాధకు చెందిన చూలు ఆవు సోమవారం నుంచి కనిపించలేదు. ఆవు కోసం వెతకగా ఊరికి దూరంగా ఆవు, దూడ మృతి చెంది ఉండడాన్ని గురువారం గుర్తించారు. పాతకక్షల నేపథ్యంలో రాధకు చెందిన చూలు ఆవుపై గిరిబాబు, చిన్నబ్బ విషప్రయోగానికి ఒడిగట్టాడరని బాధితురాలు కేవీబీపురం పోలీసులకు ఫిర్యాదుచేశారు. విచారించి కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మృతి చెందిన ఆవు, దూడకు పశువైద్యులు పంచనామా నిర్వహించారు.

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం



పథకాల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వెంగళరావుకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు

రేణిగుంట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం రేణిగుంట మండలం సూరప్పకశం సచివాలయం పరిధి అల్లికేశంలో పర్యటించారు. ఎమ్మెల్యేకు మహిళలు పెద్ద ఎత్తున మంగళ హారతులు, పెద్ద గజమాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ప్రతి కుటుంబానికి నవరత్నాల ద్వారా అన్ని సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందరికీ అందిస్తున్నట్లు గుర్తుచేశారు. కొంత మంది పింఛన్లు రద్దుచేశారంటూ ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, జువ్వల దయాకర్ రెడ్డి, రమేష్, సర్పంచ్ సుధ, ఎంపీటీసీ శశికిరణ్, శివారెడ్డి, పట్టణ అధ్యక్షులు ప్రభాకర్, హరినాథ్ యాదవ్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ మీడియా సభ్యులకు ఎమ్మెల్యే అభినందన

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండల సోషల్ మీడియా టీం ఇటీవల కాలంలో తిరుపతి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచింది. టీమ్ జగనన్న యాప్‌లో యాక్టివ్‌గా ఉన్నందున వారిని గుర్తించి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి గురువారం ప్రశంసాపత్రాలు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తొట్టంబేడు మండల సోషల్ మీడియా టీం ఇలాగే కష్టపడి పని చేస్తూ జగనన్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ముందుకు వెళ్లాలని కోరారు. అనంతరం తొట్టంబేడు మండల సోషల్ మీడియా కన్వీనర్ కేతినేని వెంగళరావును ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి, తొట్టంబేడు మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవ నాయుడు అభినందించారు.